
బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్



శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహం (ఫైల్)



జిల్లా కేంద్రంలో జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న సభ్యులు

- జిల్లా కేంద్రంలో నేడు అధికారికంగా జయంతి ఉత్సవాలు
- ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- సెలవు ప్రకటించిన కలెక్టర్

నార్నూర్: బంజారాల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్‌ను కొలుస్తారు. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు ఆయన్ను తలుచుకుంటూ పూజిస్తుంటారు. జగదాంబదేవి ప్రియ భక్తుడైన భీమానాయక్ కుమారుడు బాలబ్రహ్మచారి లక్షలాది బంజారాలను ఐక్యంగా నడిపించారు. దేశం, రాష్ట్రంలోని కోట్లమంది బంజారాలు అన్ని గ్రామాల్లో ఫిబ్రవరి 15 నుంచి నెల చివరి వరకు జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో సోమవారం ఆయన జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించనుంది. నిధులు కేటాయించడంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. జయంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాజర్షి షా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ప్రతీ తండాలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు భోగ్‌బండారో నిర్వహించి 10 గంటలకు జిల్లాకేంద్రంలో జరిగే జయంతిలో బంజారాలు పాల్గొనాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

అసలు సేవాలాల్ మహరాజ్ ఎవరు..

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా గడమంగళూరు గ్రామానికి చెందిన భీమానాయక్, ధర్మనీత దంపతులు జగదాంబదేవి మాత భక్తులు. వీరికి చాలాకాలం సంతానం కలగలేదు. దీంతో భీమానాయక్ అడవిలోని వెళ్లి మాత దర్శనం కోసం కఠోర తపస్సు చేశారు. దీంతో దేవి మాత ప్రసన్నమై వరం ప్రసాదించింది. 1739లో ఈ దంపతులకు బిడ్డ పుడతారు. ఆయనే శ్రీ సంత్‌సేవాలాల్ మహరాజ్. అతను పుట్టిన వెంటనే నది గలగల పారుతుందనే శుభసూచికలు ప్రజలకు కనిపిస్తాయి. సేవాలాల్ తర్వాత మరో ముగ్గురు హప, బదు, బాణాలు తదుపరి సంతానం కలుగుతారు. సేవాలాల్ చిన్నప్పటి నుంచే జగదాంబమాత భక్తుడు. పూర్వం బంజారా గిరిజనుల వృత్తి పశువుల కాయడం, అందుకోసం వారు దూరప్రాంతాలకు వాటిని మేపటానికి వెళ్లేవారు. ఆయన తన తమ్ముళ్లతో పశువులకు గ్రాసానికి నరసకోటకు వెళ్తారు. అక్కడ రాయిని (నంగారా) డప్పుగా వాయించి భజన చేస్తారు. అనంతరం నల్లమట్టితో సిరా (ప్రసాదం) తయారు చేసి దేవిమాతకు నైవేద్యం సమర్పించేవాడు. దీన్ని బంజారాలు 'భోగ్ బండారో' మహాభోగ్‌గా పిలుస్తారు. తన తమ్ముళ్లకు దాన్నే తినిపించేవారు. అలా మహిమలు పెరిగాయి. బాలబ్రాహ్మణునిగా మారాడు. సేవాలాల్ బంజారాలను ఏకం చేయడానికి దేశమంతా తిరిగారు. అలా పయనిస్తూ కటక నది వద్ద జగదాంబదేవి మాతను వేడుకుని ఆ నది ప్రవాహాన్ని నిలిపి 7095 ఆవులను దాటించారు. బాసర, జగిత్యాల మీదుగా హైదరాబాద్ వెళ్లారు. అక్కడ పశువులకు మేత దొరకపోవడంతో జొన్న చేనులో మేపుతారు. ఆ చేను వారు నవాబు ఉస్మాన్‌పాషాకు ఫిర్యాదు చేస్తారు. ఆయన తన సైన్యాన్ని పంపించి వారిని బంధించే ప్రయత్నం చేయగా సేవాలాల్ వారిని తిప్పి పంపుతారు. దీంతో నవాబు వారిపై విషప్రయోగం చేస్తారు. మిఠాయిలో విషం కలిపి వారికి పంపుతారు. సేవాలాల్ ఆ పదార్థాన్ని కొంత హోమంలో వేసి మిగతాది ఆవులకు మిగతా వారికి తినిపిస్తారు. ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఆశ్చర్యపోయిన నవాబు ఆ మహిమలను నమ్ముతారు. కానుకగా హైదరాబాద్ శివారులో కొంత స్థలాన్ని ఇస్తాడు. అదే నేటి బంజారాహిల్స్‌గా మారిందని బంజారాలు చెబుతున్నారు. అనంతరం సేవాలాల్ అక్కడి నుంచి సురభండ, రాయగడ్‌కు మకాం మార్చాడు. అక్కడే సమాధి అయ్యారు. అయినా భౌతిక కాయం గాలిలో లేచి మహారాష్ట్రలోని పౌరఘడ్‌లో ఆగిందని అక్కడే అంత్యక్రియలు చేసినట్లు పెద్దలు చెబుతారు. అప్పటినుంచి బంజారాలకు మహారాష్ట్రలోని పౌరక్షేత్రం పుణ్యక్షేత్రంగా మారింది.

సేవాలాల్ మాలధారణ..

సేవాలాల్ మహరాజును తలుచుకుంటూ బంజారాలను ఐక్యం చేయడానికి మాలధారణ చేపడతారు. మాలధారణ శివరాత్రికి ప్రారంభమై శ్రీరామనవమికి పూర్తవుతుంది. లక్షలాదిమంది బంజారాలు స్వీకరిస్తారు. నియమ నిష్టలతో ఆధ్యాత్మికంతో మెలుగుతారు. ప్రతీ తండా నుంచి దీక్షకు పూనుకుంటారు. దీంతో గ్రామంలో అందరూ ఐక్యంగా ఉండడంతోపాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని వీరి నమ్మకం.


ఏర్పాట్లు చేశాం



సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశాలతో అన్ని ఏర్పాట్లు చేశాం. గ్రామాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకున్నాం.

– రాథోడ్ భీంరావు, ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు

బంజారాలు తరలిరావాలి



జయంతి ఉత్సవాల కోసం బంజారాలు తరలిరావాలి. ప్రతీతండాలో భోగ్ బండారో నిర్వహించి ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకోవాలి. బంజారాల ఐక్యత, సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పాలి. తండాల నుంచి వచ్చే వారి కోసం సౌకర్యాలు కల్పించాం.

– బానోత్ గజానంద్ నాయక్, ఉత్సవ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

ప్రసన్న హరికృష్ణకు ఓయూ జేఏసీ మద్దతు



మాట్లాడుతున్న రఘు

ఆదిలాబాద్‌టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు ఓయూ జేఏసీ మద్దతు తెలుపుతున్నట్లు కన్వీనర్ రఘు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓయూ పూర్వ విద్యార్థి ప్రసన్న హరికృష్ణకు పట్టభద్రులు మద్దతు తెలుపాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడంతోపాటు వందలాది పోటీ పరీక్షలకు పుస్తకాలు రచించి నిరుద్యోగులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఓయూ జేఏసీ నాయకులు సత్యపాల్, వంశీకృష్ణ, శ్రావణ్, సాయిచరణ్, రమేశ్, శ్రీహరి, లక్ష్మణ్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు బోనాలు



మహాలక్ష్మి ఆలయంలో భక్తులు

సిరికొండ: మండల కేంద్రంలో ఆదివారం గ్రామదేవతలకు భక్తులు చలి బోనాలు సమర్పించారు. ఉదయం నుంచి పోచమ్మ, మహాలక్ష్మిలకు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. గ్రామాన్ని, కుటుంబాన్ని సల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు.

చాత్తాద సంఘం అడహక్ కమిటీ ఎన్నిక



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో చాత్తాద సంఘం జిల్లా అడహక్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరోత్తపు శ్రీనివాస స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆహరి రవీందర్, కోశాధికారిగా వకులాభరణం మురళీ, ఉపాధ్యక్షుడిగా గుండన్‌వార్ వెంకటస్వామి, సంయుక్త కార్యదర్శిగా వేదనూరి కేశవస్వామి, ప్రచార కార్యదర్శిగా తిరునగరి శ్యామ్ ఎన్నికయ్యారు. అనంతరం రామానుజ ఫిలాసఫికల్ ఫౌండేషన్ ట్రస్ట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలి



జయంతి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సేవాలాల్ నియోజకవర్గ అధ్యక్షుడు ధారావత్ నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాథోడ్ అనిల్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం జయంతి పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని సోమవారం నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ప్రతీ తండా నుంచి యువత, కులపెద్దలు తరలిరావాలని కోరారు. ప్రతీ మండలం నుంచి ఆర్టీసీ బస్సుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. బంజారా సంఘం నాయకులు రాథోడ్ గణేశ్, చౌహాన్ సాయిరాం, రాథోడ్ భలిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టీజీసెట్



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన టీజీసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కేంద్రంలో 778 మంది విద్యార్థులకుగాను 759 మంది పరీక్షకు హాజరయ్యారు. 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్ సంగీత తెలిపారు.

సన్మానం

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు సామ చిన్న నర్సారెడ్డిని మండల నాయకులు ఆదివారం సన్మానించారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ మాట్లాడుతూ 1967లో సీపీఐలో చేరి భూ పోరాటంలో అలుపెరుగని పోరాటాలు చేశారని అన్నారు. ఆయన చూపిన మార్గంలో తాము పయనిస్తామని అన్నారు. నరేశ్, దాసు, భోజన్న, మున్సిప్ ఉన్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న ట్రస్ట్‌సభ్యులు

కైలాస్‌నగర్: పట్టణానికి చెందిన సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతోంది. ఈ వారంతో అన్నదాన కార్యక్రమం 205వ వారానికి చేరుకుంది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ట్రస్ట్ సభ్యులు ఆదివారం నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చిలుకూరి నిఖిల్‌రెడ్డి, న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, రాజయ్య, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



చిన్నారిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: తప్పిపోయిన ఓ చిన్నారిని మహిళా పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాస్ కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పంచవటి హోటల్ సమీపంలో చిన్నారి సారా అలీ ఏడుస్తూ కనిపించింది. సీఐ వివరాలు అడగగా తాను చదువుతున్న పాఠశాల, క్లాస్ టీచర్ పేరు చెప్పడంతో పాఠశాలకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. నేతాజీ చౌక్‌లో ఉండే తన తండ్రి షాపును చూపించింది. స్థానికులు పాపను గుర్తుపట్టి తండ్రి వివరాలను తెలియజేశారు. దీంతో పోలీసు స్టేషన్‌కు పిలిపించి చిన్నారిని అప్పగించినట్లు సీఐ వివరించారు.

బర్డ్‌ఫ్లూ భయం..మటన్‌కు డిమాండ్



మూసి ఉన్న చికెన్ సెంటర్



ఇచ్చోడలో మటన్ షాపు వద్ద జనం

- మూతపడ్డ చికెన్ సెంటర్లు
- కోడికూరకు జనాలు దూరం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో చికెన్ సెంటర్లు గత రెండు మూడు రోజులుగా మూతపడ్డాయి. బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ తినేందుకు జనాలు ఆసక్తి చూపడం లేదు. దీంతో చికెన్ సెంటర్ నిర్వాహకులు మార్చి 1 వరకు వాటిని తాత్కాలికంగా మూసివేసినట్లు పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. నాటుకోళ్ల కోసం లభించకపోవడంతో మాంసం ప్రియులు మటన్ వైపు ఆసక్తి చూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని మటన్ ధర ఇదివరకు కిలో రూ.700 ఉండగా, ప్రస్తుతం రూ.800లకు పెంచేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో మటన్ దుకాణాల వద్ద జనాలు కిక్కిరిసిపోయారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ విక్రయాలు నిలిచిపోయాయి. పది రోజుల క్రితం కిలో రూ.240 ఉండగా, ప్రస్తుతం రూ.140 నుంచి రూ.160 వరకు పడిపోయింది. అయినప్పటికీ కొందరు చికెన్ కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతోపాటు కోడిగుడ్డు ధర తగ్గింది. ఇదివరకు రూ.6 ఉండగా, ప్రస్తుతం రూ.5కు చేరింది. వీటి సరఫరా నిలిచిపోయింది. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి వస్తున్న కోళ్ల వాహనాలను పశుసంవర్ధక శాఖ అధికారులు తనిఖీలు చేసి అనుమతిస్తున్నారు. వారం క్రితం మహారాష్ట్ర నుంచి బేల వైపు వస్తున్న ఓ కోళ్ల వ్యాన్‌ను తిరిగి పంపించేశారు. చికెన్ వ్యాపారం నడవకపోవడంతో స్వచ్ఛందంగా మూసివేశారు. ఏదేమైనా చికెన్ సెంటర్లు మూసి ఉండగా, మటన్ సెంటర్లు మాత్రం జనాలతో కిక్కిరిసిపోతున్నాయి.

మటన్ షాపుల్లో గిరాకీ

ఇచ్చోడ: బర్డ్‌ఫ్లూ కారణంగా మండల కేంద్రంలో ఆదివారం సగానికి పైగా చికెన్ సెంటర్లు తెరుచుకోలేదు. మటన్ షాపుల్లో గిరాకీ పెరిగింది. జనాలతో ఆ షాపులు కిక్కిరిసిపోయాయి. గంటల సేపు వేచిచూసి కిలో.రూ 750తో మటన్ కొనుగోలు చేసి వెళ్లారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న గవ్వల శ్రీకాంత్

ఆదిలాబాద్‌టౌన్: ఒక్కసారి అవకాశం ఇవ్వండి..నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గవ్వల శ్రీకాంత్ అన్నారు. జిల్లాకేంద్రంలోని నేతాజీచౌక్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయులతో ఆదివారం ఎన్నికల ప్రచార సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవి ఉద్యోగాలు కొట్లాడి తెచ్చుకున్న, మన బతుకులు నిర్ణయించే ఎన్నికలని తెలిపారు. అనేక సమస్యలపై అవగాహన కలిగి ఉన్నానని, పట్టబద్రుల ఎమ్మెల్సీ సీరియల్ నెంబర్ 5కు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ల రమేశ్, నేతకాని మహార్ కుల సంఘం రాష్ట్ర లీగల్ అడ్వైజర్ పసుల రాజలింగం, బీసీ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబారి ప్రశాంత్ కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


నిరుపేదలకు బాసటగా ఉండాలి



మాట్లాడుతున్న గయాజ్ అహ్మద్

బేల: ముస్లిం సోదరులు నిరుపేదలకు బాసటగా ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గయాజ్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని దహెగాం గ్రామంలోని దారుల్ ఉలూమ్ అజీజియా మదర్సా 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మదర్సాలో దివ్య ఖురాన్‌ను కంఠస్థం సంపూర్తి చేసిన 8 మంది విద్యార్థులను సన్మానించారు. మదర్సా నిర్వాహకులు అక్బరుద్దీన్ ఇస్మామి, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గ్రూప్ సేవలు భేష్



శేఖర్‌బాబును సన్మానిస్తున్న సార్‌మేడి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న అభిమన్యు వాట్సాప్ గ్రూప్ సేవలు భేష్ అని సార్‌మేడి దౌలత్‌రావు పేర్కొన్నారు. అభిమన్యు అడ్మిన్ మెస్రం శేఖర్ బాబును గాదిగూడ మండలంలోని ఝరి రాయి సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా దౌలత్‌రావు మాట్లాడుతూ విద్య, వైద్యరంగాల్లో వెనుకబాటుతనాన్ని గుర్తించి ఆదివాసీ విద్యార్థులను ప్రోత్సహించి వారికి అండగా ఉంటున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులను అభినందించారు. ఉపమేడి కొడప జకు, గితేదార్ భీంరావ్ పటేల్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 25 ఏళ్ల వీరి అపూర్వ సమ్మేళనానికి స్థానిక పాఠశాల వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. పూర్వ గురువులు ఆహ్వానించారు.

అర్లి(టి) పాఠశాలలో..

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు 18 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన అపూర్వ సమ్మేళనానికి 50 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు రమేశ్‌రెడ్డి, సుదర్శన్, సరోజ, భారతి, పూర్వ విద్యార్థులు శంకర్, గజానన్, ప్రణీత, స్నేహ, శృతి తదితరులు పాల్గొన్నారు.



అర్లి(టి) పాఠశాలలో పూర్వవిద్యార్థులు

ఘనంగా మైసమ్మ తల్లికి పూజలు

బోథ్, మండల కేంద్రంలోని 12వ వార్డులో సామాజిక కార్యకర్త, పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్ చట్ల ఉమేశ్ తన సొంత నిధులతో మైసమ్మ తల్లి ఆలయాన్ని పునఃనిర్మించారు. ఆదివారం కాలనీ వాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం కాలనీవాసులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సురేష్ వైద్య, మురళీ, సీహెచ్.బ్రహ్మానందం, పోతరెడ్డి, గంగాధర్, రాము, గంగయ్య, రమేశ్, బింటూ, సురేందర్, లక్ష్మణ్, హనుమాన్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భీమన్న దేవుడి పండుగ



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో ఆదివారం భీమన్న దేవుడి పండుగ, జాతర నిర్వహించారు. భీమన్నగుట్ట ఆలయంలో భీమన్న దేవుడికి బండారు, బాసంతం, కల్యాణం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి రూ.రెండు వేలను విరాళంగా అందించారు. మండలాధ్యక్షుడు మల్లేశ్, భూషణ్, కోల శ్రీనివాస్, జగన్‌రెడి ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన రజియా సుల్తానా భర్త అఖ్తర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2002–23 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి, పిల్లలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ద్యావంతు శేఖర్, చట్ల సతీశ్‌కుమార్, మాజిద్, షకీల్, వీణ, సంగీత, శ్రీకాంత్, నాగేశ్, ధర్మరాజు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు కర్రలే ఆధారం



తాంసి: భీంపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో పలుచోట్ల విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. చేతికందే ఎత్తులో ఉండడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిప్పల్‌కోటి శివారులో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. గ్రామస్తులు వాటికి కర్రలను అమర్చారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

సీపీఎస్ రద్దుకు కృషి

ముధోల్: తనను గెలిపిస్తే సీపీఎస్ రద్దు, పాతపెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం కృషి చేస్తానని బీఎస్పీ బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యాటకారి సాయన్న పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు ఉన్నారు.